## క్లుప్తంగా

### సీపీఐ మండల కార్యదర్శిగా రజనీకాంత్



చిట్యాల: సీపీఐ మండల కార్యదర్శిగా మండలంలోని కైలాపూర్ గ్రామానికి చెందిన చింతల రజనీకాంత్‌ను నియమించినట్లు జిల్లా కార్యదర్శి బందు సాయిలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే సోషల్ మీడియా కన్వీనర్‌గా భూక్యా నవీన్, మండల కమిటీ సభ్యులుగా కల్పన, రాజమణి, శిరీష, పైడి వినోద్‌లను నియమించినట్లు తెలిపారు.

### మండల కమిటీ ఎన్నిక



టేకుమట్ల: రజక సంక్షేమ సంఘం మండల కమిటీని మండల కేంద్రంలో ఎన్నికల సంక్షేమ అధికారి నేరేళ్ల రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెలికాని శంకర్, ప్రధాన కార్యదర్శిగా వైనాల రవీందర్, ఉపాధ్యక్షులుగా జంగపెల్లి సమ్మయ్య, కోశాధికారి బోనగిరి తిరుపతి, సహాయ కార్యదర్శి నిమ్మల స్వామి, గౌరవ అధ్యక్షుడిగా మాచర్ల ఓదెలు, ముఖ్య సలహాదారులుగా జంగపెల్లి సారయ్య, తిరుపతి, నడిగోటి రమేశ్‌లతో పాటు కార్యవర్గ సభ్యులుగా జంగపెల్లి సదయ్య, నిమ్మల దేవేందర్, రమేశ్, రాజ్‌కుమార్, అనిల్, రవి, రాజు, నస్పూర్ అనిల్, తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన మండల కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులను మండల కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

### 'ఇంటిని కూల్చడం అన్యాయం'

మల్హర్: మండలంలోని రుద్రారం గ్రామంలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న ఓ మహిళ ఇంటిని పలువురు కూల్చేయడం అన్యాయమని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. శనివారం బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించి మాట్లాడుతూ.. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. బాధితురాలిని ఆదుకోని, న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ చంద్రమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, సోషలిస్టు పార్టీ ఇన్‌చార్జ్ భిక్షపతి, లచ్చయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

### ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి వద్ద పలిమెల మండలం, పెద్దంపేట నుంచి తరలివస్తున్న ఇసుక లారీలను గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామాల మీదుగా వెళ్తున్న లారీలతో పంట నష్టం జరుగుతుందని, తీవ్రంగా దుమ్ము, దూళితో అనా రోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపించారు.

### చెరువులో పడి వృద్ధుడి మృతి

రేగొండ(కొత్తపల్లిగోరి): చెరువులో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన కొత్తపల్లిగోరి మండలం సుల్తాన్‌పూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వేముల సాయిలు (70) గురువారం తన బంధువు అంత్యక్రియలకు వెళ్లాడు. సంస్కారాలు ముగిసిన అనంతరం ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు సాయిలు కోసం వెతకగా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో బంధువులు మూడో రోజు కార్యక్రమానికి శనివారం చెరువు వద్దకు వెళ్లగా అక్కడ సాయిలు మృతదేహం కనిపించింది. ఈ ఘటనపై మృతుడి కూతురు గోపగాని రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

# ప్రమాదకరంగా కల్వర్టులు



టేకుమట్ల-చిట్యాల ప్రధాన రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు



టేకుమట్ల-అంకుషాపూర్ ప్రధాన రోడ్డులో..

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

టేకుమట్ల: మండలంలోని పలు గ్రామాల్లోని ప్రధాన రోడ్లకు నిర్మించిన లోలెవల్ కల్వర్టులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారాయి. ప్రధానంగా చిట్యాల-టేకుమట్ల ప్రధాన రహదారిలో నాలుగు లోలెవల్ కల్వర్టులు నిత్యం భారీ వాహనాల రాకపోకలతో పూర్తిగా శిథిలమయ్యాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారిలోని కల్వర్టులు ధ్వంసమైన అధికారులు పట్టింకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. టేకుమట్ల శివారులోని టేకులకుంట వద్ద గల కల్వర్టు వర్షాకాలంలో వరదకు మరింత ధ్వంసం కాగా కొందరు కల్వర్టు దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడ్డారు. అలాగే కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం సమీపంలోని కల్వర్టు మధ్యలో గుంతలు పడడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. శాంతినగర్ శివారులో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా ఉండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

**జారుతున్న అంకుషాపూర్-టేకుమట్ల లోలెవల్ కల్వర్టు**

పొలాల నుంచి వచ్చే వరద నీటి వల్ల అంకుషాపూర్-టేకుమట్ల లోలెవల్ కల్వర్టుపై పాకురు నిండుకుని వాహనదారులు ప్రయాణించే సమయంలో జారి పడ్డ సంఘటనలు ఉన్నాయి. వాహనదారులే కాకుండా కాలినడకన వెళ్లే వారు సైతం జారి పడుతున్నారు. అక్కడ హైలెవల్ కల్వర్టు నిర్మించాలని గతంలో చాలా సార్లు అధికారులకు, పాలకులకు మొరపెట్టుకున్నా నిర్మించలేదు. ప్రస్తుతం టేకుమట్ల-నవాబుపేట ప్రధాన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో కల్వర్టులను హైలెవల్ కల్వర్టులుగా నిర్మిస్తే మెరుగైన రవాణా సౌకర్యం కొనసాగుతుంది. కావున ప్రస్తుతం రోడ్డు నిర్మాణంతో పాటు లోలెవల్ కల్వర్టులను హైలెవల్ కల్వర్టులుగా నిర్మించాలని అధికారులను మండల ప్రజలు కోరుతున్నారు.

## శిఖం భూమి చదును పనుల అడ్డగింత



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

కాటారం: మండల కేంద్రంలోని తిమ్మనకుంట శిఖం భూమిలో చదును పనులను శనివారం పలువురు గ్రామస్తులు, రైతులు అడ్డుకున్నారు. తిమ్మనకుంట శిఖం భూమిని గతంలో కలెక్టర్ మిని స్టేడియం నిర్మాణానికి కేటాయించారు. కాగా ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో పాటు భూమి అన్యాక్రాంతానికి గురవుతుందని పలువురు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ నాగరాజు, ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు భూమిలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడానికి పూనుకున్నారు. విషయం తెలుసుకున్న పలువురు గ్రామస్తులు, రైతులు శిఖం భూమిని ఆనుకొని తమ పట్టా భూములు ఉన్నాయని సర్వే చేయించి తమకు హద్దులు ఏర్పాటు చేసే వరకు ఎలాంటి పనులు చేయవద్దని అధికారుల ఎదుట నిరసన తెలిపారు. అధికారులు ఎంత నచ్చజెప్పినప్పటికీ వారు వినలేదు. దీంతో అధికారులు పనులు నిలిపివేసి వెనుదిరిగారు.

## అలుగు రవాణా చేస్తున్న 8 మందిపై కేసు



నిందితులతో అటవీశాఖ అధికారులు

భూపాలపల్లి: వన్యప్రాణి అలుగు(వాలుగ) రవాణా చేసిన కేసులో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు భూపాలపల్లి రేంజ్ ఆఫీసర్ నరేష్ తెలిపారు. రేంజ్ ఆఫీసర్ తెలిపిన వివరాల ప్రకారం.. వైల్డ్‌లైఫ్ క్రైం కంట్రోల్ బ్యూరో, చెన్నై వారు అందించిన సమాచారంతో శుక్రవారం అలుగు రవాణా చేస్తున్న తాటి రాజ్‌కుమార్, నజీర్, అంజాద్‌లను కాటారం మండలంలోని టోల్‌గేట్ వద్ద అదుపులోకి తీసుకున్నామని అన్నారు. అలుగును స్వాధీనం చేసుకొని నిందితులను హనుమకొండలోని అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్లి ప్రశ్నించామన్నారు. శనివారం భూపాలపల్లి అటవీశాఖ కార్యాలయానికి తీసుకొచ్చి విచారించగా, వారు అందించిన సమాచారం మేరకు అలుగు అక్రమ రవాణాలో వారితో పాటు గట్టు సమ్మయ్య, నరివెద్ది వెంకటనారాయణ, తాళ్లపల్లి శంకర్, ఊరుగొండ దేవన్న, పెద్ది లక్ష్మయ్యలకు కూడా ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించడం జరిగిందన్నారు. ఈ మేరకు సమ్మయ్య, వెంకటనారాయణలను అదుపులోకి తీసుకున్నామన్నారు. శంకర్, దేవన్న, లక్ష్మయ్యలు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో వన్యప్రాణి చట్టం కింద కేసు నమోదు చేసి ఐదుగురిని భూపాలపల్లి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు రేంజ్‌ఆఫీసర్ తెలిపారు.

## సేఫ్టీ మోకులపై శిక్షణ పొంది ఉండాలి



గీతకార్మికులతో రవీందర్‌రెడ్డి

ఏటూరునాగారం: గీత కార్మికులు సేఫ్టీ మోకులపై శిక్షణ పొంది ఉండాలని బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి, ఎక్సైజ్ సీఐ రామకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కల్లు గీత కార్మికులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రొయ్యూర్, గుర్రేవుల, కాటాపురం గ్రామాల గీత కార్మికులకు సేఫ్టీ మోకుల వినియోగంపై ట్రైనర్స్‌తో ట్రైనింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం తమకు ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని, సర్దార్‌పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గీతకార్మికులు వినతిపత్రాలను సమర్పించారు. సొసైటీ అధ్యక్షుడు తాళ్లపల్లి నరేందర్, గుండెబోయిన రవి, శ్రీనివాస్, నర్సయ్య, సత్యనారాయణ, రాజమౌళి పాల్గొన్నారు.

# 'పల్లెప్రకృతి'పై పట్టింపేది?

**అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పల్లెప్రకృతి వనాలు**

- పట్టించుకోని అధికారులు



పల్లె ప్రకృతి వనంలో తాగిపడేసిన మద్యం బాటిళ్లు

మంగపేట: మండలంలో లక్షలాది రూపాయల ఖర్చుతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను వదిలేశారా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆహ్లాదాన్ని పంచే పల్లె ప్రకృతి వనాల నిర్వహణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాటిన మొక్కలు ధ్వంసమై చెత్తా చెదారంతో నిండిపోయాయి. సంబంధిత అధికారులు పల్లెప్రకృతి వనాల ఏర్పాటులో మొదట్లో చూపినంత ఆర్భాటం, పర్యవేక్షణ రెండేళ్ల నుంచి గాలికి వదిలేయడంతో అధికారులు ప్రజా ధనాన్ని వృథా చేశారే తప్ప వాటి వలన ఒరిగింది ఏమీలేదని ప్రజలు వాపోతున్నారు.

**మందుబాబులు, పేకాట రాయుళ్లకు అడ్డా..**

మండలంలోని 37 పల్లెప్రకతి వనాలను ఏర్పాటు చేశారు. కాగా వాటిపై ఏమాత్రం శ్రద్ధ చూపక పోవడంతో పశువులు, మేకలు సంచరిస్తుండటంతో మొక్కలు చనిపోగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ లేకుండా పొయింది. దీంతో పలు గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారాయి. మల్లూరు, కొత్తమల్లూరు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు మందుబాబులు, పేకాట రాయుళ్లకు అడ్డాలుగా మారాయి. దీంతో పల్లెప్రకృతి వనాల్లో మద్యం బాటిళ్లు, తాగి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, తినిపడేసిన చికెన్, మటన్ వ్యర్థాలతో కంపు కొడుతున్నాయి. గ్రామాల్లో పల్లెప్రకతి వనాల నిర్వహణపై మండల స్థాయి అధికారులు మందలించినా ఆయా పంచాయతీల కార్యదర్శులు, సిబ్బందిలో ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం. జిల్లా స్థాయి అధికారులు సైతం పట్టించుకోక పోవడంపై ప్రజల నుంచి అనేక విమర్శలు వినవస్తున్నాయి. ఈ విషయంపై కలెక్టర్ దృష్టి సారించి నిరుపయోగంగా ఉన్న వాటిని వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

> **పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం..**
>
> మొదట్లో ఈజీఎస్ నిధులతో నిర్వహణ కొనసాగింది. రెండేళ్ల నుంచి ఈజీఎస్ నిధులు విడుదల కాకపోవడంతో నిర్వహణ పంచాయతీలపై భారం పడింది. మేజర్ పంచాయతీలలో నిధులు ఉండటంతో నిర్వహణ కొనసాగుతోంది. చిన్న గ్రామ పంచాయతీలో నిధుల కొరత కారణంగా నిర్వహణ కష్ట తరంగా ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన వెంటనే నిబంధన మేరకు వాటిని పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటాం.
>
> - ఎంపీఓ శ్రీకాంత్‌నాయుడు

### అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మొగుళ్లపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో కొలువుదీరిన దుర్గామాత శనివారం మూడోరోజు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కాగా బండారి వేణు కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదలను అందజేసి మహాన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వేణవంక నవీన్, ప్రసాద్, భజనమండలి సభ్యులు, అన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### రేషన్ షాపుల తనిఖీ

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని పలు రేషన్ షాపుల్లో ఆర్డీఓ మంగీలాల్ శనివారం తనిఖీ చేపట్టారు. శాంతినగర్, ఎల్‌బీనగర్‌లోని రేషన్‌షాపుల్లో తనిఖీలు నిర్వహించి స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం లబ్ధిదారులందరికీ రేషన్ బియ్యాన్ని అందించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి నెల స్టాక్ వివరాలు అందించాలని, రోజు వారిగా రిపోర్టులు పంపించాలని ఆదేశించారు. తహసీల్దార్ వెంట శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### వెంకటస్వామి జయంతి వేడుకలు



వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాజీ కేంద్ర మంత్రి వెంకటస్వామి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యాక్రమంలో ప్రిన్సిపాల్ విజయదేవి, అధ్యాపకులు రవీందర్, ప్రవీణ్, నరేందర్, భరత్, నరేశ్ పాల్గొన్నారు.

### 'మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలి'

భూపాలపల్లి అర్బన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో సీపీఎం మండల నాలుగోవ మహాసభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బందు సాయిలు మాట్లాడుతూ.. బీజేపీ మతోన్మాద ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ప్రజా ప్రయోజనాలకు దేశ అభివృద్ధికి తీరని నష్టం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆకుదారు రమేశ్, శేఖర్, మహేందర్, రవికుమార్, గోపాల్, రమ, శారద, వసుందర, రాధా తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి సోహెల్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చొక్కాల, రంగరాజాపురం, వెంకటాపురం, వీరభద్రవరం, తిప్పాపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

## ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణంలోని సింగరేణి మైన్స్ రెస్క్యూ స్టేషన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీ దుర్గామాత దేవాలయ భూమి పూజ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ చేశారు. అనంతరం సింగరేణి జీఎం కార్యాలయంలో నిర్వహించిన కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దత్తాత్రేయ ఆలయంలో చండీయాగం



చండీయాగంలో పాల్గొన్న శ్రీనుబాబు

కాటారం: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ధన్వాడ దత్తాత్రేయ ఆలయంలో శనివారం చండియాగం నిర్వహించారు. అంతకముందు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య పురోహితులు చండీయాగం జరిపించారు. శ్రీపాద ట్రస్టు చైర్మన్, కాంగ్రెస్ యూత్ నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు గ్రామస్తులతో కలిసి చండీయాగంలో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు శ్రీనుబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురోహితులు కృష్ణ మోహన్, ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కళాశాలల్లో బతుకమ్మ సంబురాలు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు



సువిద్య డిగ్రీ కళాశాలలో..

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సువిద్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించుకున్నారు. బతుకమ్మ ఆట పాటలతో నృత్యాలు చేస్తు అలరించారు. అధ్యాపకులు బతుకమ్మ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగాం ఆఫీసర్ యుగందర్, లెక్చరర్లు బాలకృష్ణ, సువిద్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కందికొండ రాజు, వేణు, లోకేందర్, కుమార్, శ్రీలత, రజిత ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



కాళేశ్వరం: పరామర్శిస్తున్న పుట్ట మధుకర్



టేకుమట్ల: పరామర్శిస్తున్న ఏవైఎస్ నాయకులు

టేకుమట్ల: మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన బోయిని మధునయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి అంబేద్కర్ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు నేరేళ్ళ రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో శనివారం పరామర్శించారు. మధునయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళలర్పించారు. ఏవైఎస్ మండల అధ్యక్షుడు ఆరకొండ రాజయ్య, నాయకులు బోయిని తిరుపతి, రజినీకాంత్, రమేశ్, సుమన్, పైడి, సంపత్, హరికృష్ణ, సమ్మయ్య, సారయ్య, రాజు, మధూకర్, అందె కుమార్ ఉన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ బండం పుష్పలత ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ శనివారం పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, నాయకులు అలీం ఖాన్, మహేష్, బాబురావు తదితరులు ఉన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాస్

ఏటూరునాగారం: క్రీడలు దేహదారుఢ్యంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందని సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ క్రీడామైదానంలో హోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో స్నేహసంబంధాలు పెంచుకోవచ్చన్నారు. హోప్ సంస్థ వారు మరిన్ని క్రీడలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు తాజొద్దీన్, టీవీఆర్ సూరి, హోప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఖలీద్, కాంగ్రెస్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఆయూబ్, పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, కోఆప్షన్ సభ్యుడు వలియాబీ సలీం, ఫయాజ్, మినాజ్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలను అరికట్టడం బాధ్యత



మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు

ములుగు రూరల్: గ్రామాల్లో మత్తు పదార్థాలను అరికట్టడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని సర్వాపూర్‌లో ఎస్సై గ్రామ సభ నిర్వహించారు. ముందుగా గ్రామ స్థాయి అధికారులను సమావేశంలో భాగస్వామ్యం చేస్తూ గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలు ఎదురైతే ప్రజలు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావచ్చని అన్నారు. మధ్యవర్తులను తీసుకురాకూడదని అన్నారు. సమస్యల పరిష్కారానికి పోలీసులు తమవంతు తోడ్పాటును అందిస్తామని అన్నారు. బాల్య వివాహాల నివారణ, సైబర్ క్రైమ్ వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.